తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
94949 23460

ఎడిటర్ : రత్నం నాగరాజు
RNI . TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
మంగళవారం
28 అక్టోబర్ 2025
సంపుటి 70
సంచిక 3
పేజీలు 8
వెల రూ. 5.00

Epaper : WWW.tharangalu.comEpa
Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna

## నేడు 'సినీ కార్మికుల' అభినందన సభ..
### - హాజరుకానున్న రేవంత్ రెడ్డి

- సాయంత్రం నాలుగు గంటలకు 'సినీ కార్మికుల' అభినందన సభ
- యూసుఫ్‌గూడ పోలీస్ మైదానంలో జరగనున్న సభ
- కార్యక్రమానికి హాజరు కానున్న సినీ పెద్దలు

02

## ఆధార్ కార్డుకు సంబంధించి నవంబర్ 1 నుంచి మారనున్న రూల్స్

- అడ్రస్ మార్చాలంటే ఆధార్ కేంద్రానికి వెళ్లనక్కర్లేదట
- పేరు, మొబైల్ నెంబర్ కూడా మార్చేసుకోవచ్చు
- ఇంట్లో నుంచే ఆన్ లైన్ లో మార్పులు చేసుకోవచ్చని అధికారుల వెల్లడి

02

## బీజేపీకి ఓటు వేయకపోతే ఎంఐఎం బలం 8కి పెరుగుతుంది
### - రాంచందర్ రావు

- జూబ్లీహిల్స్‌లో అసలు పోటీ బీజేపీ, ఎంఐఎం మధ్యేనన్న రాంచందర్ రావు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ చేసిందేమీ లేదన్న రాష్ట్ర బీజేపీ చీఫ్
- ఈ ఉప ఎన్నిక 2028 ఎన్నికలకు నాంది పలకాలని వ్యాఖ్య

02

# హైదరాబాద్ శివార్లలో
# 100 ఎకరాల్లో భారీ గోశాల
## - రూ. 157 కోట్లు మంజూరు

- రంగారెడ్డి జిల్లా ఎన్కేపల్లిలో స్థలం కేటాయింపు
- భూమిని నమ్ముకున్న 40 కుటుంబాలకు పునరావాసం, ఉద్యోగ హామీ
- భూమిని స్వాధీనం చేసుకున్న హెచ్ఎండీఏ.. టెండర్ల ప్రక్రియ ప్రారంభం
- నగరంలోని నిరాశ్రయ గోవులకు ఆశ్రయం కల్పించడమే లక్ష్యం





తరంగాలు, డెస్క్, అక్టోబర్ 27 : తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న సందిగ్ధతపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో రెండు వారాల్లోగా స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని (ఈసీ) ఆదేశించింది. ఈ అంశంపై ప్రభుత్వం, ఎన్నికల సంఘం కలిసి చర్చించుకుని ఒక నిర్ణయానికి రావాలని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు కొట్టివేయడంతో, స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల సంఘం ఇటీవల నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఈసీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సురేందర్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా, సుప్రీంకోర్టు కూడా ఎన్నికలు నిర్వహించుకోవచ్చని చెప్పింది కదా అని హైకోర్టు గుర్తు చేసింది. దీనిపై ఎన్నికల సంఘం తరపు న్యాయవాది స్పందిస్తూ, సుప్రీంకోర్టు కేవలం మౌఖికంగా మాత్రమే చెప్పిందని, లిఖితపూర్వక ఆదేశాల్లో ఆ ప్రస్తావన లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల ఆధారంగా నోటిఫికేషన్ ఇచ్చామని, అది చెల్లకపోవడంతోనే నిలిపివేశామని వివరించారు. రిజర్వేషన్ల అంశంపై ప్రభుత్వంతో చర్చించి, స్పష్టత వచ్చిన తర్వాతే కొత్తగా నోటిఫికేషన్ జారీ చేయగలమని తెలిపారు. ఈ ప్రక్రియ కోసం కొంత సమయం అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం, ఎన్నికల సంఘం తరపు న్యాయవాదులు రెండు వారాల సమయం కోరడంతో, హైకోర్టు అంగీకరిస్తూ తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఆ లోగా ఎన్నికల తేదీలపై ఒక స్పష్టమైన నిర్ణయంతో రావాలని నిర్దేశించింది.

## నాడు రాహుల్ గాంధీ ప్రయాణించిన ఆటోలో ప్రయాణం చేసిన కేటీఆర్!

- మస్రత్ అలీ అనే వ్యక్తి ఆటోలో తెలంగాణ భవన్ వచ్చిన కేటీఆర్
- అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ ఈయన ఆటోనే ఎక్కారని గుర్తు చేసిన కేటీఆర్
- ఆటో డ్రైవర్లకు ఎన్నో హామీలు ఇచ్చి నెరవేర్చలేదని కేటీఆర్ విమర్శ




తరంగాలు, డెస్క్, అక్టోబర్ 27 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆటోలో ప్రయాణించారు. తెలంగాణ లోని ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకోవడానికి, వారికి మద్దతుగా మస్రత్ అలీ అనే వ్యక్తి ఆటోలో కేటీఆర్ తెలంగాణ భవన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలోని ఆరు లక్షలకు పైగా ఆటో డ్రైవర్ల పరిస్థితి చాలా ఇబ్బందికరంగా ఉందని అన్నారు. గతంలో మస్రత్ అలీ ఆటోలోనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రయాణించారని ఆయన గుర్తు చేశారు. నాడు ఇదే ఆటోలో ప్రయాణించిన రాహుల్ గాంధీ, ఆటో డ్రైవర్లకు ఎన్నో హామీలు ఇచ్చారని విమర్శించారు. నిన్న రాహుల్, నేడు నేను ప్రయాణించిన ఈ మస్రత్ అలీ తనకున్న రెండు ఆటోలను అమ్మి ప్రస్తుతం కిరాయి ఆటో నడుపుతున్నాడని ఆయన తెలిపారు. ఆత్మహత్య చేసుకున్న 161 మంది ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటోలో ప్రయాణించిన సమయంలో మస్రత్ అలీతో డ్రైవర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేటీఆర్ ఆటోలో ఉన్న సమయంలో పలువురు సెల్ఫీ దిగేందుకు ఆసక్తి కనబరిచారు.

## ఆన్‌లైన్ ట్రేడింగ్ ఫ్రాడ్..
### - సాయిప్రీతి పేరుతో రూ. 10 లక్షలు మోసం



హైదరాబాద్‌కు చెందిన వ్యక్తిని మోసం చేసిన సైబర్ నేరగాళ్లు

సాయిప్రీతి పేరుతో చాటింగ్ చేసి డబ్బులు వసూలు

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ. 10 లక్షలు పెట్టుబడి పెట్టించి మోసం

వివరాలు 2 లో..

# కేటీఆర్ జాగ్రత్తగా ఉండాలని స్వయంగా కవితనే హెచ్చరించారు - మంత్రి కోమటిరెడ్డి

- కాళేశ్వరం ప్రాజెక్టులో హరీశ్ రావు, సంతోష్ రావు దోచుకున్నారని కవిత చెప్పారన్న మంత్రి
- కాళేశ్వరం అవినీతి అంశంలో రామన్న జాగ్రత్తగా ఉండాలని కవిత అన్నారని వ్యాఖ్య
- కేటీఆర్ తనస్థాయి వ్యక్తి కాదన్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



తరంగాలు, డెస్క్, అక్టోబర్ 27 : కాళేశ్వరం ప్రాజెక్టులో హరీశ్ రావు, సంతోష్ రావు దోచుకున్నారని, కేటీఆర్ జాగ్రత్తగా ఉండాలని స్వయంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. "కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి అంశంలో... రామన్నా జాగ్రత్త" అని కవితనే హెచ్చరించారని గుర్తు చేశారు. జూబ్లీహిల్స్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ ఐదు ముక్కలైందని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన స్థాయికి తగిన వ్యక్తి కాదని విమర్శించారు. తాను మొదటిసారి ఎమ్మెల్యే అయినప్పుడు ఆయన గుంటూరులో ఇంకా చదువుకుంటున్నాడని వ్యాఖ్యానించారు. పేదలకు సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన చేయని కేటీఆర్ గురించి మాట్లాడటం అనవసరమని అన్నారు.

**బీఆర్ఎస్ ఓడిపోవడం ఖాయం: చామల కిరణ్ కుమార్ రెడ్డి**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడం ఖాయమని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి జోస్యం చెప్పారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి డిపాజిట్ కూడా దక్కలేదని అన్నారు. వరుస ఎన్నికల్లో ఓడిపోతే బీఆర్ఎస్ కనుమరుగవుతుందనే భయంతో హరీశ్ రావు, కేటీఆర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులపై కవిత అవినీతి ఆరోపణలు చేశారని గుర్తు చేశారు. కవిత చేసిన ఆరోపణల ఆధారంగానే హరీశ్ రావు, కేటీఆర్‌లపై ఫిర్యాదు చేశామని అన్నారు.

# మొంథా తుపాను..
## - అప్రమత్తమైన తెలంగాణ ప్రభుత్వం

- అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- పలు ప్రాంతాల్లో రాగల నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు
- తుపాను ప్రభావం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ మీద పడకుండా చూడాలన్న మంత్రి



తరంగాలు, డెస్క్, అక్టోబర్ 27 : మొంథా తుపాను నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. ఈ తుపాను కారణంగా రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మొంథా తుపాను ప్రభావంతో రాగల నాలుగు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, నాగర్ కర్నూలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ తుపాను ప్రభావం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ మీద పడకుండా చూడాలని, రైతాంగం ఎట్టి పరిస్థితుల్లో నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న టార్పాలిన్లను వినియోగించి ఇప్పటికే కొనుగోలు కేంద్రాలకు చేరిన ధాన్యం ....

02

# 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీం సీరియస్
## - అన్ని రాష్ట్రాలకు నోటీసులు

- 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీంకోర్టు సుమోటో విచారణ
- అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ
- మోసాలకు సంబంధించిన ఎఫ్ఐఆర్ వివరాలు సమర్పించాలని ఆదేశం
- ఇది దేశవ్యాప్త కుంభకోణం.. దర్యాప్తు సీబీఐకి అప్పగించేందుకు మొగ్గు
- ఈ మోసాల వెనుక మయన్మార్, థాయ్‌లాండ్ ముఠాలు ఉన్నాయని వెల్లడి




తరంగాలు, డెస్క్, అక్టోబర్ 27 : దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. పోలీసులు, న్యాయాధికారులమంటూ నకిలీ కోర్టు పత్రాలతో పౌరులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న మోసాలపై దాఖలైన కేసును సుమోటోగా విచారణకు స్వీకరించిన అత్యున్నత న్యాయస్థానం, సోమవారం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు విచారణ చేపట్టింది. ఈ తరహా మోసాలకు సంబంధించి తమ పరిధిలో నమోదైన ప్రథమ సమాచార నివేదికల (ఎఫ్ఐఆర్) వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. "దేశవ్యాప్తంగా ఒకేరీతిలో దర్యాప్తు జరిగేలా చూసేందుకు రాష్ట్రాలకు నోటీసులు జారీ చేస్తున్నాం" అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ 'డిజిటల్ అరెస్ట్' మోసాలు కేవలం దేశవ్యాప్తంగానే కాకుండా, దేశ సరిహద్దులు దాటి కూడా జరుగుతున్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది. అందుకే ఈ కేసుల దర్యాప్తును కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి అప్పగించేందుకు మొగ్గు చూపుతున్నట్లు సూచించింది. కేంద్ర ప్రభుత్వం తరఫున ...

02

# మొంథా తుపాను..

## - అప్రమత్తమైన తెలంగాణ ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి..
తడవకుండా చూడాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సత్వరమే మిల్లులకు తరలించాలని, అందుకు అవసరమైన రవాణా వసతి ఏర్పాటు చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో అధికార యంత్రాంగం సమష్టిగా పని చేయాలని అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 8,342 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకోగా, ఇప్పటి వరకు 4,428 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. మిగిలిన ధాన్యం కొనుగోలు కేంద్రాట్లు జరుగుతున్నాల ప్రారంభానికి ఏర్పాయని అన్నారు. ఈ రోజు వరకు 22,433 మంది రైతుల నుంచి ప్రభుత్వం 1,80,452 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని వెల్లడించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి త్వరితగతిన చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలను ఎప్పటికప్పుడు కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖాధికారులు సందర్శించి అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలులో అవినీతి చోటు చేసుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు.

# భూమి రిజిస్ట్రేషన్ కోసం లంచం.. ఏసీబీ వలలో గ్రామ పాలన అధికారి



తరంగాలు, డెస్క్, అక్టోబర్ 27 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఓ ప్రభుత్వ అధికారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. భూమి రిజిస్ట్రేషన్ కోసం ఓ వ్యక్తి నుంచి రూ.15,000 లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ములకలపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలోని పుసుగూడెం రెవెన్యూ క్లస్టర్‌లో బానావత్ శ్రీనివాస్ రావు గ్రామ పాలన అధికారిగా పనిచేస్తున్నాడు. ఓ వ్యక్తికి చెందిన 2 ఎకరాల 30 గుంటల భూమి రిజిస్ట్రేషన్ పని కోసం శ్రీనివాస్ రావు రూ.60,000 లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ముందుగా రూ.40,000 చెల్లించాడు. మిగిలిన రూ.20,000 కోసం అధికారి ఒత్తిడి చేయడంతో బాధితుడు తన ఆర్థిక పరిస్థితిని వివరించి కొంత తగ్గించాలని కోరాడు. దీనికి అంగీకరించిన శ్రీనివాస్ రావు, రూ.5,000 తగ్గించి, మిగిలిన రూ.15,000 వెంటనే ఇవ్వాలని సూచించాడు. ఈ క్రమంలో లంచం ఇవ్వడం ఇష్టంలేని బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు మంగళవారం బాధితుడు శ్రీనివాస్ రావుకు రూ.15,000 ఇస్తుండగా, అక్కడే మాటువేసిన అధికారులు అతడిని పట్టుకున్నారు.

# నేడు 'సినీ కార్మికుల' అభినందన సభ..

## - హాజరుకానున్న రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి..
తరంగాలు, డెస్క్, అక్టోబర్ 27 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు యూసుఫ్‌గూడలో సినీ కార్మికుల అభినందన సభలో పాల్గొననున్నారు. ఈ సభ సాయంత్రం నాలుగు గంటలకు యూసుఫ్‌గూడ పోలీస్ మైదానంలో జరగనుంది. ఈ కార్యక్రమానికి సినీ ప్రముఖులు హాజరు కానున్నారు. ఇదిలా ఉండగా, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో రేవంత్ రెడ్డి ప్రచార షెడ్యూల్ విడుదలైంది. ఈ నెల 31 నుంచి నవంబర్ 9వ తేదీ వరకు ఆయన జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించనున్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 31న సాయంత్రం 7 గంటలకు వెంగళరావునగర్, సాయంత్రం 8 గంటలకు సోమాజిగూడలో రేవంత్ రెడ్డి ప్రచారం నిర్వహిస్తారు. నవంబర్ 1న సాయంత్రం 7 గంటలకు బోరబండ, సాయంత్రం 8 గంటలకు ఎర్రగడ్డలో ప్రచారం ఉంటుంది. నవంబర్ 4న సాయంత్రం 7 గంటలకు షేక్‌పేట, సాయంత్రం 8 గంటలకు రహమత్ నగర్‌లో ప్రచార కార్యక్రమాలు జరుగుతాయి. నవంబర్ 5న సాయంత్రం 7 గంటలకు షేక్‌పేట, సాయంత్రం 8 గంటలకు య-ూసుఫ్‌గూడలో రేవంత్ రెడ్డి ప్రచారం చేయనున్నారు. నవంబర్ 8న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల మధ్య 6 డివిజన్‌లలో మోటార్ సైకిల్ ర్యాలీ, నవంబర్ 9న ఉదయం 10 గంటలకు షేక్‌పేటలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నారు.

# 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీం సీరియస్

## - అన్ని రాష్ట్రాలకు నోటీసులు

మొదటిపేజీ తరువాయి..
తరంగాలు, డెస్క్, అక్టోబర్ 27 : హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ఇలాంటి అనేక కేసులను సీబీఐ ఇప్పటికే దర్యాప్తు చేస్తోందని, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సైబర్ క్రైమ్ విభాగం సాంకేతిక సహకారం అందిస్తోందని కోర్టుకు తెలిపారు. అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి మాట్లాడుతూ, ఈ మోసాల వెనుక ఉన్న మనీలాండరింగ్ ముఠాలు భారత్ బయట నుంచి, ముఖ్యంగా మయన్మార్, థాయ్‌లాండ్ వంటి దేశాల నుంచి పనిచేస్తున్నాయని వివరించారు. విచారణ సందర్భంగా, హర్యానా ప్రభుత్వం స్పందిస్తూ... అంబాలా సైబర్ క్రైమ్ బ్రాంచ్‌లో రెండు ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయని, దర్యాప్తును సీబీఐకి బదిలీ చేయడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలియజేసింది. సంబంధిత ఇతర ఎఫ్‌ఐఆర్‌ల వివరాలు సమర్పించేందుకు వారం రోజుల సమయం కోరగా, ధర్మాసనం అనుమతించింది. ఈ క్రమంలో, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తమ పరిధిలో నమోదైన 'డిజిటల్ అరెస్ట్' సంబంధిత ఎఫ్‌ఐఆర్‌ల వివరాలను అందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రస్తుతానికి అధికారికంగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాల్సిన అవసరం లేదని, కేవలం కేసుల వివరాలను రికార్డుల రూపంలో అందించాలని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు తమ నివేదికలు సమర్పించిన తర్వాత ఈ కేసుపై తదుపరి విచారణ జరగనుంది.

# ఆధార్ కార్డుకు సంబంధించి నవంబర్ 1 నుంచి మారనున్న రూల్స్

మొదటిపేజీ తరువాయి..
తరంగాలు, డెస్క్, అక్టోబర్ 27 : ఆధార్ కార్డులో మార్పులు చేసుకోవాలంటే ఉదయాన్నే ఆధార్ కేంద్రాలకు పరుగుపెట్టి, చాంతాడంత క్యూలో నిల్చుని టోకెన్ తీసుకుని పడిగాపులు కాస్తే తప్ప సాధ్యం కాదు. చిన్న చిన్న మార్పులకూ ఓ రోజు మొత్తం ఆధార్ కేంద్రంలోనే గడిచిపోతుంది. కొన్నిసార్లు రద్దీ ఎక్కువగా ఉండడం వల్ల మరుసటి రోజు కూడా పరుగులు పెట్టాల్సి వస్తుంది. ఇకపై ఈ ఇబ్బంది ఉండదని యూఐడీఏఐ తెలిపింది. ఆధార్ కార్డులో పేరు, పుట్టిన తేదీ, జెండర్, చిరునామా, మొబైల్ నెంబర్ వంటి వివరాల్లో మార్పులు చేర్పులు చేసుకోవడానికి ఆధార్ కేంద్రం దాకా వెళ్లాల్సిన అవసరం లేదని చెబుతోంది. నవంబర్ 1 నుంచి ఈ మార్పులను ఇంట్లో కూర్చుని ఆన్ లైన్ లో మీరే మార్చేసుకోవచ్చని తెలిపింది. ఈమేరకు సరికొత్త విధానాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొంది. ఆధార్ అప్‌డేట్ ప్రక్రియను మరింత వేగంగా, సురక్షితంగా మార్చడమే ఈ కొత్త ఆన్‌లైన్ విధానం లక్ష్యమని తెలిపింది. ఫింగర్ ప్రింట్స్, ఐరిస్ వంటి బయోమెట్రిక్ అప్‌డేట్స్ కోసం మాత్రం తప్పనిసరిగా ఆధార్ సేవా కేంద్రాన్ని సందర్శించాల్సిందేనని తెలిపింది. అయితే, ఆధార్ అప్ డేట్ కు సంబంధించిన ఫీజులు పెరిగాయి. పేరు, అడ్రస్ మార్పులకు రూ.75, బయోమెట్రిక్ మార్పులకు రూ.125 చెల్లించాల్సిందే. 15 ఏళ్లలోపు చిన్నారులకు బయోమెట్రిక్ మార్చేందుకు ఎలాంటి ఫీజు లేదని యూఐడీఏఐ పేర్కొంది.

# హైడ్రా ప్రజావాణికి కబ్జా ఫిర్యాదుల వెల్లువ..

## - సాక్ష్యాలతో తరలివస్తున్న జనం

తరంగాలు, డెస్క్, అక్టోబర్ 27 హైదరాబాద్‌లో భూకబ్జాలు, అక్రమ నిర్మాణాలపై నగరవాసులు నేరుగా రంగంలోకి దిగుతున్నారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్యలకు హైడ్రా ప్రజావాణిలో తక్షణ పరిష్కారం లభిస్తుండటంతో, బాధితులు సాక్ష్యాలతో సహా కార్యాలయానికి క్యూ కడుతున్నారు. సోమవారం ఒక్కరోజే ప్రజావాణికి ఏకంగా 52 ఫిర్యాదులు అందడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నేరుగా పర్యవేక్షిస్తున్న ఈ కార్యక్రమానికి వస్తున్న ప్రజలు, తమ సమస్యలను ఫొటోలు, వీడియోల రూపంలో అధికారుల ముందుంచుతున్నారు. రోడ్లను ఆక్రమిస్తే ఫొటోలు, చెరువులను కబ్జా చేస్తుంటే వీడియోలతో సహా వచ్చి ఫిర్యాదు చేస్తున్నారు. కొందరు బాహాటంగా తమ వివరాలు వెల్లడిస్తుంటే, మరికొందరు తమ పేర్లను గోప్యంగా ఉంచాలని కోర-ుతున్నారు. గంటల్లో, రోజుల్లోనే తమ సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్న నమ్మకంతోనే వస్తున్నామని పలువురు చెబుతున్నారు.



**ప్రభుత్వ భూములు, చెరువులే లక్ష్యం**

ప్రజావాణికి అందిన ఫిర్యాదుల్లో ప్రభుత్వ భూములు, చెరువుల కబ్జాలకు సంబంధించినవే అధికంగా ఉన్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, బాలానగర్ మండలం హస్మత్‌పేట్‌లోని సర్వే నంబర్ 1లో ఉన్న 28.28 ఎకరాల చారిత్రక ప్రభుత్వ భూమిని స్థానిక రాజకీయ నాయకులు, వారి అనుచరులు ఆక్రమించి ప్లాట్లుగా అమ్ముతున్నారని ఓల్డ్ బోయిన్‌పల్లి వాసులు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా, శంషాబాద్ పరిధిలోని నరసింహ కుంట తూములు మూసేయడంతో పంట పొలాలు, ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్లు మునిగిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లోని 22 ఎకరాల శాంబుని కుంట ఆక్రమణలతో ఆరేడు ఎకరాలకు పరిమితమైందని, కూకట్‌పల్లిలోని పరికి చెరువులో 12 ఎకరాలను రాత్రికి రాత్రే మట్టితో పూడ్చేస్తున్నారని స్థానికులు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. సాగర్ రోడ్డులో కాలనీ రోడ్లను కబ్జా చేసి ప్లాట్లుగా మార్చారని, అమీన్‌పూర్ పెద్ద చెరువు కబ్జాను అడ్డుకున్న వారిపై దాడులు చేస్తూ పోలీసులతో తప్పుడు కేసులు పెట్టిస్తున్నారని పలువురు వాపోయారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్వయంగా పరిశీలించారు. సమస్యల తీవ్రతను బట్టి సంబంధిత అధికారులకు వాటిని అప్పగించి, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు.

# బీజేపీకి ఓటు వేయకపోతే ఎంఐఎం బలం 8కి పెరుగుతుంది

## - రాంచందర్ రావు

మొదటిపేజీ తరువాయి..
తరంగాలు, డెస్క్, అక్టోబర్ 27 : జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సమీపిస్తున్న వేళ బీజేపీ ప్రచారంలో దూకుడు పెంచింది. ఈ ఎన్నికలో అసలు పోటీ తమకు, ఎంఐఎం పార్టీకి మధ్యేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజలు బీజేపీకి ఓటు వేయకపోతే, మజ్లిస్ సీట్ల సంఖ్య 8కి పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.



హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్ రావు అధ్యక్షతన ఉపఎన్నికపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. జూబ్లీహిల్స్ స్థానాన్ని ఎలాగైనా కైవసం చేసుకునేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలు చర్చించారు. ప్రచారంలో నగరంలోని కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులను విస్తృతంగా భాగస్వామ్యం చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ.. "జూబ్లీహిల్స్‌లో ఎంఐఎంను ఆపాలంటే బీజేపీని గెలిపించాలి. ప్రజల్లో కూడా బీజేపీని గెలిపించాలనే ఆలోచన బలంగా ఉంది" అని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు. 2028లో జరిగే సాధారణ ఎన్నికల్లో బీజేపీ గెలుపుకు జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నాంది పలకాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మరోవైపు, నామినేషన్ల పర్వం ముగియడంతో అధికార బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కూడా నియోజకవర్గంలో హోరాహోరీగా ప్రచారం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ కూడా ప్రచారాన్ని ముమ్మరం చేసింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు నవంబర్ 11న పోలింగ్ జరగనుండగా, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపడతారు.

# మీ అల్లుడిని కంట్రోల్‌లో పెట్టుకోండి - కేసీఆర్‌కు మంత్రి లక్ష్మణ్ సూచన

తరంగాలు, డెస్క్, అక్టోబర్ 27 : మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావుపై రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. హరీశ్ రావు నోటికి వచ్చినట్లు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ మంత్రివర్గాన్ని 'దండుపాళ్యం బ్యాచ్' అంటున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ వ్యాఖ్యలపై హరీశ్ రావు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బలహీన వర్గాలకు చెందిన మంత్రులున్న కేబినెట్‌ను ఉద్దేశించి ఇలాంటి వ్యాఖ్యలు ఎలా చేస్తారని అడ్లూరి లక్ష్మణ్ ప్రశ్నించారు. "మా మంత్రివర్గం దండుపాళ్యం బ్యాచ్ అయితే, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని మంత్రివర్గం స్టువర్ట్‌పురం దొంగల ముఠా లాంటిదా?" అని ఆయన నిలదీశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల మంత్రులపై చేసిన ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, హరీశ్ రావు వెంటనే తన మాటలను వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా అడ్లూరి లక్ష్మణ్ మరికొన్ని సంచలన ఆరోపణలు చేశారు. "కేసీఆర్‌కు తెలియకుండానే గతంలో హరీశ్ రావు 28 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు సొంతంగా ఫండింగ్ చేశారు. ఈ విషయం తెలియడం వల్లే రెండోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినా కేసీఆర్ వెంటనే ఆయనకు మంత్రి పదవి ఇవ్వలేదు" అని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో హరీశ్ రావు అవినీతికి పాల్పడ్డారని గతంలో కవిత చేసిన ఆరోపణలను గుర్తు చేస్తూ, దీనిపై చర్చకు రమ్మంటే ఆయన తోక ముడిచారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను చర్చకు పంపుతానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తాము అంబేద్కర్ విగ్రహం వద్ద చర్చకు రావడానికి సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. చివరగా, "కేసీఆర్ గారూ.. దయచేసి మీ అల్లుడిని కంట్రోల్‌లో పెట్టుకోండి" అని అడ్లూరి లక్ష్మణ్ హితవు పలికారు.



# ఆన్‌లైన్ ట్రేడింగ్ ఫ్రాడ్..

## - సాయిప్రీతి పేరుతో రూ. 10 లక్షలు మోసం

మొదటిపేజీ తరువాయి..
తరంగాలు, డెస్క్, అక్టోబర్ 27 : ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తిని సైబర్ నేరగాళ్లు రూ. 10 లక్షల మేర మోసగించారు. సాయిప్రీతి అనే పేరుతో చాటింగ్ చేస్తూ అతడి నుంచి భారీగా సొమ్ము కాజేశారు. లంగర్‌హౌస్‌కు చెందిన 42 ఏళ్ల వ్యక్తితో సాయిప్రీతి పేరుతో సైబర్ నేరగాళ్లు చాటింగ్ చేశారు. ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ. 10 లక్షలు పెట్టుబడి పెట్టించారు. బాధితుడు ఆ మొత్తాన్ని విడతల వారీగా పెట్టుబడి పెట్టాడు. మంచి లాభాలు రావడంతో ఆ మొత్తాన్ని వెనక్కి తీసుకునేందుకు ప్రయత్నించగా విఫలమయ్యాడు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన SRR ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి



వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తేదీ 27 అక్టోబర్ ( తరంగాలు) : వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పనీష్ తండా గ్రామంలో. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు భూక్య లాలు నాయక్‌లి గారి భార్య కైక గారుఇటీవల మరణించగా ఈ రోజు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి SRR ఫౌండేషన్ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం చేసిన. SRR ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డి. ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి,మండల పార్టీ ముఖ్య నాయకులు లేతకుల రంగా రెడ్డి SRR ఫౌండేషన్ ప్రతినిధిలు గజావెల్లి ప్రసాద్ సర్పంచ్ భూక్య బాద్రు నాయక్, మండల పార్టీ నాయకులు గారే నర్సయ్య, స్థానిక నాయకులు అయిన తదితరులు పాల్గొన్నారు.

## టీబి వ్యాధిని ముందస్తుగా గుర్తించాలి

### - జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్





మహబూబాబాద్, ప్రతినిధి అక్టోబర్.27, తరంగాలు : ముందస్తు టి బి నిర్ధారణ పరీక్షల శిక్షణ కార్యక్రమం లో భాగంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్యం శాఖ అధికారి డా. రవి రాథోడ్ మాట్లాడుతూ టి బి వ్యాధిని అరికట్టడం లో భాగంగా 2025 వరకు టిబి రహిత జిల్లా గా నిర్మాణం చేయటం కోసం అందరూ కలిసి పనిచేయాలని చూచించారు.టీబీ మందులు వాడుతున్న కుటుంబ సభ్యులకు ఇగ్రా పరీక్ష చేయడం ద్వారా ముందస్తు టీబీ ని గుర్తించి టీబీ ఇన్ఫెక్షన్ ఉన్నవారికి మందులు అందించాలని చూచించారు.తధ్వారా టీబీ ని తొందరగా అరికట్టవచ్చని అన్నారు.ఈ కార్యక్రమం లో టి బి ప్రోగ్రామ్ అధికారి డా. విజయ్ కుమార్ ల్యాబ్ టెక్నీషన్లు, నర్సింగ్ ఆఫీసర్స్ టీబీ వ్యాధి ముఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

## పారదర్శకంగా మద్యం దుకాణాల టెండర్ లక్కీడ్రా






- నిబంధనల మేరకు దుకాణాలు నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్
- ఏ.బి వేడుకల మందిరంలో A4 మద్యం దుకాణాల టెండర్ లక్కీడ్రా

మహబూబాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 27, తరంగాలు : మద్యం దుకాణాల టెండర్ లక్కీ డ్రా పారదర్శకంగా నిర్వహించామని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ స్పష్టం చేశారు.జిల్లాలో 2025- 2027 సంవత్సరం వరకు కొనసాగనున్న మద్యం షాపుల టెండర్ల ఓపెన్ డ్రా జిల్లా కేంద్రంలోని సబ్ జైల్ దగ్గర ఉన్న ఏ.బి వేడుకల మందిరంలో సోమవారం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో మొత్తం 61 దుకాణాలు ఉన్నాయని, సెప్టెంబర్ 26వ తేదీన టెండర్ నోటిఫికేషన్, అప్లికేషన్లు స్వీకరణ మొదలుపెట్టామని, దరఖాస్తులు ఈ నెల(అక్టోబర్) 23వ తేదీ వరకు స్వీకరించామని తెలిపారు. మొత్తం దరఖాస్తులు 1800 వచ్చాయని వెల్లడించారు. డిసెంబర్ 01 వ తేదీ నుంచి నూతన లైసెన్సులతో మద్యం దుకాణాలు కొనసాగనున్నాయని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దుకాణాలు నిర్వహించాలని ఆదేశించారు. షాపులకు సంబంధించిన లైసెన్స్ ఫీజు చెల్లించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, జిల్లా ఎక్సైజ్ అధికారి కిరణ్ కుమార్, ఎక్సైజ్ సీఐలు చిరంజీవి, నాగేశ్వర్ రావు, బిక్షపతి, అశోక్,మరియు ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

## హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో టీయూడబ్ల్యూజే ఘన విజయం

### - గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో జర్నలిస్టుల సంబురాలు






తరంగాలు, హనుమకొండ, అక్టోబర్ 27 : ఎంతో ప్రతిష్టాత్మకంగా, హోరా హోరీగా జరిగిన హైదరాబాద్ ప్రెస్ క్లబ్ కార్యవర్గ ఎన్నికల్లో టీయుడబ్ల్యూజే మద్దతుతో పోటీ చేసిన ఫ్రెండ్స్ ప్యానెల్ అఖండ మెజారిటీతో ఘన విజయం సాధించింది. దీంతో హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం టీయూడబ్ల్యూజ్జే (ఐజేయూ) రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రెస్ క్లబ్ బాధ్యులు సంబురాలు జరుపుకున్నారు. ప్రెస్ క్లబ్ ఆవరణలో బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేసుకుని హైదరాబాద్ లో ఐజేయూ విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజ్జే రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, రాష్ట్ర హౌసింగ్, వెల్ఫేర్ కన్వీనర్ వల్లాల వెంకటరమణ మాట్లాడుతూ హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో ఐజేయూ ఘన విజయానికి ఎంతో కృషి చేసి ప్యానల్ ను గెలిపించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో విషసర్పాలన్నీ ఏకమై, ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా, చారిత్రాత్మక తీర్పుతో చెంప పెట్టు లాంటి సమాధానం చెప్పి, ఫ్రెండ్స్ ప్యానెల్ మొత్తాన్ని అనూహ్య మెజారిటీతో గెలిపించిన హైదరాబాద్ జర్నలిస్టులకు ధన్యవాదాలు తెలిపారు. టీయూడబ్ల్యూజే పట్ల ఉన్న విశ్వాసాన్ని, అభిమానాన్ని చాటుకున్న హైదరాబాద్ జర్నలిస్టులకు వారు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రెస్ క్లబ్ సభ్యుల విశ్వాసాన్ని వమ్ముచేయకుండా, వారి రుణాన్ని తీర్చుకోడానికి నిరంతరం కృషి చేస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోల్ల అమర్, టీయూడబ్ల్యూజ్జే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్, పెండెం వేణుమాధవ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు పివి. మదన్ మోహన్, గడ్డం కేశవ–మూర్తి, పిన్నా శివ కుమార్, యూనియన్ నాయకులు సిహెచ్ సోమ నర్సయ్య,కెంచ కుమారస్వామి, మాదం రజినీకుమార్, డాక్టర్ పొడిశెట్టి విష్ణు వర్ధన్, సాయిరాం, యాంసాని శ్రీనివాస్, మంచాల రాజు, ముదిగిరి ఓదెలు, అల్లె రామారావు, రామ్మోహన్, సంపతి ప్రభాకర్, తాండూరి గోపి, కొమ్మాలు,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాతల ఆర్థిక అభివృద్ధియే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం





తరంగాలు, రాయపర్తి, 27 అక్టోబర్ : అన్నదాతల ఆర్థిక అభివృద్ధియే లక్ష్యంగా.. రైతులందరూ ప్రభుత్వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని ఈరోజు రాయపర్తి పట్టణంమరియు జెతూరం తండా, మైలారం గ్రామాలలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులతో కలిసి టెంకాయలు కొట్టి ప్రారంభించిన.. వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి గారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల ఆర్థిక అభివృద్ధి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి అన్నారు, దాన్యం కొనుగోలులో ఎలాంటి అవకతవకలు జరగవద్దని, రైతులు పండించిన ప్రతి దానం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతుల పంటకు ప్రభుత్వ మద్దతు లతో రైతుల పంటకు(సన్న రకం) ప్రభుత్వ మద్దతు ధరతో పాటు రూపాయలు 500 బోనస్ అంది స్తున్నట్లు తెలిపారు,కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన స్వల్పకాలం లోనే దేశంలో ఎన్నడూ లేని విధంగా ఏకకాలంలో రైతు రుణ మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో.. డిఆర్డీవో రాంరెడ్డి మరియు డిసిఎస్ఓ డి.కిష్టయ్య, డీ ఎం సివిల్ సప్లయస్ %దీ%. సంధ్యారాణి, డీపీఎం దాసు, ఏపీఎం రవీందర్, ఎమ్మార్వో శ్రీనివాస్, ఎంపీడీవో కిషన్, పిఎసిఎస్ చైర్మన్ కుందూరు రామచంద్రారెడ్డి మరియు బ్లాక్ అధ్యక్షుడు, మండల పార్టీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశా–రు.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

### - పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య





వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తేదీ 27 అక్టోబర్ (తరంగాలు ప్రతినిధి) : రాయపర్తి మండలం,మైలారం గ్రామంలోని భాగ్యలక్ష్మి జాన్నిగ్ మిల్లులో ఏర్పాటుచేసిన సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పత్తి కొనుగోలు కేంద్రాన్ని అధికారులతో కలిసి టెంకాయలు కొట్టి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన. వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిట చైర్మన్ నరకుడు వెంకటయ్య ( మరియు) వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్. సరికొండ కృష్ణారెడ్డి గారు ఈ సందర్భంగా మాట్లాడుతూ. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య సూచించారు,రైతులు తేమ లేకుండా చూసుకొని, నాణెమైన పత్తిని తెచ్చి మద్దతు ధర పొందాలని, కొలువు కొనుగోలులో ఎలాంటి అవకతవకలు లేకుండా ప్రభుత్వం సిసిఐ ద్వారా పత్తికొనుగోలు చేస్తుందన్నారు,కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన స్వల్పకాలంలోనే దేశంలో ఎన్నడూ లేనివిధంగా ఏకకాలంలో రైతు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డివో రాంరెడ్డి మరియు డి సి ఎస్ ఓ డి.కిష్టయ్య,డీ ఎం సివిల్ సప్లయస్ %దీ%.సంధ్యారాణి,డీపీఎం దాసు, ఏపీఎం రవీందర్,ఎమ్మార్వో శ్రీనివాస్, ఎంపీడీవో కిషన్,మరియు బ్లాక్ అధ్యక్షుడు,మండల పార్టీ అధ్యక్షుడు,కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

# ఎమ్మెల్యే కడియం శ్రీహరికి పాలాభిషేకం

- అభివృద్ధి దిశగా మరో ముందడుగు ఎస్సీ కాలనీకి 10 లక్షలు, సిసి రోడ్లకు 30 లక్షల నిధులు మంజూరు



జఫర్‌గడ్ ప్రతినిధి, అక్టోబర్ 27, (తరంగాలు): మండలంలోని సాగరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరికి ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు.గ్రామ ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని,అభివృద్ధి దారిలో సాగరం ముందడుగు కాంగ్రెస్ చేతే ప్రజా పాలన అంటూ నినాదాలతో ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో సాగరం గ్రామ అభివృద్ధి పట్ల శ్రీహరి చూపుతున్న చొరవకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ అభివృద్ధి అంటే కేవలం పనులు కాదు. ప్రతి ఇంటికి వెలుగు, ప్రతి యువకుడికి అవకాశాలు, ప్రతి గ్రామానికి ప్రగతి అందించడం కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం.ప్రజల ఆశయాలకు తగిన ప్రజా పాలనను అందించడమే మా లక్ష్యం, అన్నారు.ఎమ్మెల్యే గ్రామాభివృద్ధి నిమిత్తం మొత్తం 40 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అందులో ఎస్సీ కాలనీ సిసి రోడ్ల నిర్మాణానికి 10 లక్షలు, గ్రామంలోని మిగతా సిసి రోడ్లకు 30 లక్షలు కేటాయించారు. ఈ నిర్ణయం గ్రామ ప్రజల్లో ఆనందాన్ని నింపింది. గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతాభివందనం తెలిపారు. ప్రజా నమ్మకానికి ప్రతీకగా కాంగ్రెస్ తెలంగాణ యువజన కాంగ్రెస్ స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తీగల నాగరాజ్ మాట్లాడుతూ సాగరం అభివృద్ధి దిశగా శ్రీహరి చూపుతున్న చొరవ ప్రజలకకు ధైర్యం నింపుతోంది. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిధులు కేటాయించడం ఆయన ప్రజానురక్తతకు నిదర్శనం," అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు గ్రామ శాఖ అధ్యక్షుడు పిన్నింటి రాజు, మహిళా మండల అధ్యక్షురాలు లోనే రమాదేవి, నాయకులు పట్టవట్టి చిన్నారెడ్డి, లోనీ నాగేష్, పిన్నింటి శ్రీనివాస్, వజీర్, యువరాజ్, బుజ్జి, బిక్షపతి, కత్తుల ఎల్లయ్య, ఖైరిక మల్లయ్య, తాటికాయల చైతన్, కత్తుల సుమన్, బొజ్జు కిరణ్, గబ్బెట విష్ణు, బాష్పాక భాస్కర్, శివరాత్రి భాస్కర్, శివరాత్రి తిరుపతి, ఉపాసి నరసింగరావు, చాగంటి రాజేంద్ర, పిట్ట రాజు, మురిమేకల సాంబరాజు, పిన్నింటి నితిన్, బజ్జు సదానందం, తాటికాయల వెంకటయ్య, మచ్చ యాదయ్య, మచ్చ బాబు, మచ్చ రాజు, బొజ్జు శోభన్, నల్లబెట్ల హరీష్, కొంతం హరీష్, పిన్నింటి రవి పాల్గొన్నారు.

# జాటోత్ భాస్కర్ పార్థివ దేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి, అక్టోబర్. 27, తరంగాలు : కేసముద్రం మండల కేంద్రంలోని కాట్రపల్లి గ్రామపంచాయతీ శివారు భవాని గడ్డ తండాలోని జిల్లెల్ల తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ వార్డు నెంబర్ జాటోత్ చంద్రు నాయక్ కుమారుడు జాటోత్ భాస్కర్ అనారోగ్యంతో మరణించగా..విషయంతెలుసుకున్నమహబూబాబాద్ శాసనసభ్యులు భూక్య మురళీనాయక్ సోమవారం మృతుడి స్వగృహానికి వెళ్లి వారి పార్థివ దేహానికి నివాళులు అర్పించారు.. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యాన్ని ఇచ్చారు..అలాగే జాటోత్ భాస్కర్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని కోరుకున్నారు. ఎమ్మెల్యే మురళీనాయక్ వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ సభ్యులు గుగులోత్ దశ్రు నాయక్, పాల్వాయి, వెంకట్ రెడ్డి, సిరికొండ మల్లయ్య, బూర బిక్షపతి, చాగంటి యాదగిరి కాంగ్రెస్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు జల్లే యాకాంబరం, ఉపాధ్యక్షులు పుట్ట ప్రభాకర్, మండల ఉపాధ్యక్షులు, జాటోత్ లక్ష్మణ్, అడప రవీందర్ ధరావత్ రాజు, శీలం యాదగిరి తండా వాసులు, తదితరులు పాల్గొన్నారు.



# రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి.

- రక్త దానం చేయండి.. ప్రజల ప్రాణాలను కాపాడండి
- ఎస్సై కూచిపూడి జగదీష్ తిరుమలయపాలెం

పాలేరు ఆర్సీ, 27అక్టోబర్ (తరంగాలు) పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఈ నెల 31న నేలకొండపల్లి మండల కేంద్రం లో తిరుమలాయపాలెం పోలీస్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీష్ పిలుపునిచ్చారు. రోడ్డు ప్రమాద బాధితులు, తలసేమియా, సికిల్ సెల్, డెంగ్యూ వంటి వ్యాధులతో బాధపడుతున్న రోగులకు రక్తం అత్యవసరమవుతుందని ఆయన పేర్కొన్నారు. బ్లడ్ బ్యాంకుల్లో రక్త నిల్వలు తక్కువగా ఉండడం వల్ల అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారు. అలాంటి బాధితులకు మన రక్తదానం ప్రాణదానం అవుతుందని ఎస్సై కూచిపూడి జగదీష్ అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమలాయపాలెం మండల ప్రజలు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని, రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఆయన కోరారు.



# ధాన్యం కొనుగోలు సెంటర్ల ఇంచార్జ్ లకు శిక్షణ..

కేసముద్రం,మహబూబాబాద్, ప్రతినిధి, అక్టోబర్.27, తరంగాలు : మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కేసముద్రం రైతు వేదిక యందు వ్యవసాయ శాఖ రెవెన్యూ శాఖ, సహకార శాఖ, పంచాయత్ రాజ్ శాఖ మరియు పోలీస్ శాఖల ఆధ్వర్యంలో ఈ వానాకాలం 2025 సీజన్ గాను వరి ధాన్యం కొనుగోలు పై మండలంలోని కొనుగోలు సెంటర్ ఇన్చార్జి లకు హార్వెస్టర్ల యజమానులకు నాణ్యత ప్రమాణాల మీద రైతుకు మద్దతు ధర పొందే విషయంలో శిక్షణ కార్యక్రమం ఇవ్వడం జరిగింది. ప్రభుత్వం వరి పంటకు 2025 26 వానకాలం సీసన్ గాను గ్రేడ్ ఏ రకానికి 2389 రూపాయలు అదేవిధంగా సాధారణ రకానికి 2369 క్వింటల్ కు ప్రకటించడం జరిగింది. ప్రభుత్వం సన్నధాన్యానికి మద్దతు ధరతో పాటు కింటాకు 500 రూపాయలు బోనస్ ఇస్తున్నందున రైతులు ధాన్యానికి కొనుగోలు సెంటర్కు తీసుకువచ్చే ముందు 17 శాతం లోపు తేమ ఉండేటట్టుగా చూసుకోవాలని రైతులు వారి చెలక వద్దనే కోసినటువంటి ధాన్యానికి, తూర్పాలు పట్టుకొని మట్టి పెల్లలు, చెత్తాచెదారం లేకుండా 17% లోపు తేమ ఉండేటట్టు చూసుకున్న తర్వాత మాత్రమే ధాన్యం కొనుగోలు సెంటర్కు తీసుకురావాలని మండల వ్యవసాయ అధికారి బి. వెంకన్న, కేసముద్రం తాహ సిల్దార్ తెలిపారు. ధాన్యం కొనుగోలు సెంటర్లో కావలసినటువంటి గన్ని బ్యాగులు, తార్పల్లి సీట్లు మాయిచ్చర్ మిషన్లు, ఎలక్ట్రిసిటీ, నీతి వసతి మైంటైన్ చేయాలని కేసముద్రం తాహసిల్దార్ వివేక్ సొసైటీ సీఈఓ లకు తెలియజేయడం జరిగింది. హార్వెస్టర్ యజమానులు పంట కోత చేసే ముందు హార్వెస్టర్ ఫ్యాన్ స్పీడు 18 నుంచి 20 ఆర్పిఎం ఉండేటట్లు చూసుకోవాలని, ఎట్టి పరిస్థితిలో పచ్చిగా ఉన్నప్పుడు వరి కోతలు చేపట్ట రాదని వారు తెలియజేశారు. కేసముద్రం ఎంపీడీవో క్రాంతి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలను రైతులు పాటించి ధాన్యము కొనుగోలు సెంటర్ కు వచ్చే విధంగా సెంటర్ ఇన్చార్జిలు మరియు జిపిఓ లు





వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు విరివిగా తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలములోని పిఏసిఎస్, సీఈఓస్, ధాన్యం కొనుగోలు సెంటర్ ఇన్చార్జీలు, జిపిఓలు వ్యవసాయ విస్తరణ అధికారులు, హార్వెస్టర్ యజమానులు పాల్గొన్నారు

# మానుకోటను రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతాం..

- బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే తెలంగాణ సర్కార్ లక్ష్యం..
- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



మహబూబాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 27, తరంగాలు : మహబూబాబాద్ మునిసిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి తెలంగాణ రాష్ట్రం లో రోల్మోడల్గా తీర్చిదిద్దుతామని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మానుకోట మునిసిపాలిటీకి రూ.59.62 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరీ చేయడాన్ని హర్షిస్తూ స్థానిక తహసీల్ కార్యాలయం ఎదుట సీఎం రేవంత్రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, సీఎం సలహాదారులు వేం నరేందర్రెడ్డి, ఎంపీ పోరిక బలరాంనాయక్ ఫ్లెక్సీకి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ...గత బీఆర్ఎస్ ప్రభుత్వం మానుకోట మునిసిపాలిటీకి రూ.50 కోట్లు మంజూరీ చేశామని పైలాన్ కట్టి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. పట్టణాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్టబడి ఉందని చెప్పారు. రూ.59.62 కోట్ల నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీ కాల్వలు, పార్కుల అభివృద్ధి, ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. పాఠశాలల మౌళిక వసతుల కల్పనకు రాష్ట్ర సర్కార్ ప్రత్యేకంగా నిధులు కేటాయిం చినట్లుతెలిపారు. మానుకోటను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది రాష్ట్రంలో నెం బర్వన్గా నిలుపుతామని చెప్పారు. తొలుత 30వ వార్డులో రూ.20 కోట్లతో చేపట్టే తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, తదితరులు, అభిమానులు, పాల్గొన్నారు.

# యువకుడు ఆత్మహత్య..

పాలేరు ఆర్సీ, 27 అక్టోబర్ (తరంగాలు) పాలేరు నియోజకవర్గం లోని కూసుమంచి మండలం, నర్సింహులగూడెం గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. నర్సింహులగూడెం గ్రామానికి చెందిన కొక్కిరేణి ఎర్రయ్య తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాలు కారణం అని తెలుస్తోంది. సమాచారం తెలుసుకున్న కూసుమంచి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# కొత్తకొండ చిలకమ్మ కు నివాళులర్పించిన గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మి గౌడ్ చిలువేరు



కేసముద్రం,మహబూబాబాద్, ప్రతినిధి,అక్టోబర్.27, తరంగాలు: కేసముద్రం మున్సిపాలిటీ కేసముద్రం స్టేషన్ మార్కెట్ బజార్ లోని వికాస్ ఫ్యాన్సీ క్లాస్ స్టోర్ యజమాని కొత్తకొండ యాదగిరి, వీరస్వామి సాగర్, రమేష్, శ్రీనివాస్ ల మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మరణించగా విషయం తెలిసిన వెంటనే వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించి చిలకమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు కాంగ్రెస్ మండల నాయకులు సమ్మిగౌడ్ ఫౌండేషన్ అధినేత చిలువేరు సమ్మయ్య గౌడ్.అనంతరం వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని కోరుకుంటూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ కార్యక్రమంలో సమ్మి గౌడ్ వెంట శ్రావణ్, అవినాష్,ఆకాష్, విద్యాధర్, కళాధర్, మనోజ్, భాను ప్రకాష్, అమర్ తదితరులు ఉన్నారు.

# నేడు రైతులకు అవగాహన కార్యక్రమం..

పాలేరు ఆర్సీ,27 అక్టోబర్ ( తరంగాలు) రైతులకు ప్రభుత్వం నిర్వహించే రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా నేడు (మంగళవారం) ఉదయం 10 గంటలనుంచి 11గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని మండల వ్యవసా-యాధికారిణి రామడుగు వాణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని కూసుమంచి, గట్టుసింగారం, నాయకన్ గూడెం రైతువేదికలలో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీఐ కేంద్రాలలో పత్తి విక్రయం ఏవిధంగా చేయాలి, కిసాన్ కపాస్ యాప్ ఏవిధంగా వినియోగించాలి, మొక్కజొన్న కొనుగోలు వంటి అంశాలపై మార్కెటింగ్, మార్క్ ఫెడ్ అధికారులతో




అవగాహన ఉంటుందని తెలిపారు. కావున రైతులు అధికసంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని అన్నారు.

# కూసుమంచి ఎంపీడీవోగా తాటిపాముల జశ్వంత్ కుమార్

పాలేరు ఆర్సీ,27అక్టోబర్ (తరంగాలు) కూసుమంచి మండల ఎంపీడీవోగా తాటిపాముల జశ్వంత్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో ఇటీవల ప్రకటించిన గ్రూప్ 1 ఫలితాలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెం పట్టణానికి చెందిన తాటిపాముల జశ్వంత్ కుమార్ ఎంపిక కావడంతో అక్టోబర్ 12వ తేదీనుంచి నూతనంగా ఎంపికైన అభ్యర్థులకు ప్రాథమిక శిక్షణ అనంతరం నేడు సోమవారం జశ్వంత్ కుమార్ కూసుమంచి మండల పరిషత్ అధికారిగా విధులకు హాజరైనారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 1నుంచి ఎంపీడీవోగా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు నిర్వర్తించిన



రాంచందర్ రావు, కార్యాలయ సిబ్బంది నూతన ఎంపీడీవో జశ్వంత్ కుమార్ కు స్వాగతం పలికారు.

# తండ్రికి తలకొరివి పెట్టిన తనయ..



పాలేరు ఆర్సీ, 27అక్టోబర్ ( తరంగాలు) కూసుమంచి గ్రామ మాజీ ఎంపీటీసీ మాదాసు ఉపేందర్ సోదరుడు (అన్న) మాదాసు వెంకన్న అనారోగ్య కారణాలతో సోమవారం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న నాయకులు, మాదాసు ఉపేందర్ మిత్రులు, శ్రేయోభిలాషులు సోమవారం వెంకన్న నివాసానికి చేరుకుని ఉపేందర్ ను పరామర్శించారు. వెంకన్నకు ఇద్దరు కుమార్తెలే కావడంతో పెద్ద కుమార్తె (విద్యాంగురాలు) రమణ తండ్రికి తలకొరివి పెట్టి తన బాధ్యతను నిర్వర్తించింది. ఈ సందర్భంగా వెంకన్న అంతిమయాత్రలో గ్రామస్తులు, బంధువులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దివ్యాంగురాలైన కుమార్తె రమణ తలకొరివి పెట్టిన సన్నివేశం అందరినీ కంటతడి పెట్టించింది.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి





పాలేరు ఆర్సీ,27అక్టోబర్ ( తరంగాలు) రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది వివరాలు ఇలా ఉన్నాయి మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన గోకినపల్లి శేషయ్య 70 సంవత్సరాలు అనే వృద్ధుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వృద్ధాప్య పెన్షన్ డబ్బుల కోసం ఇంటి నుండి బయలుదేరి పిండిప్రోలు ఐఓబి బ్యాంకు వెళ్లి పెన్షన్ తీసుకున్న శేషయ్య ఇంటికి వెళ్లేందుకు హైవే రోడ్డు దాటుతుండగా వరంగల్ వైపు నుండి ఖమ్మం వైపు వెళ్తున్న కార్ డ్రైవర్ అతివేగంగా ఆజాగ్రత్తగా కారు కారు నడుపుతూ వచ్చి గుద్దటంతో ఈ ప్రమాదంలో శేషయ్య తలకు బలమైన గాయాలు కాగా వెంటనే వైద్య చికిత్స కొరకు అదే కారులో తిరుమలాయ-పాలెం సిహెచ్ సి ఆసుపత్రికి తరలించారు అక్కడ వైద్యులు శేషయ్య మృతి చెందినట్లు తెలిపారు . మృతుడికి ఇద్దరు కుమారులు శంకర్ రమేష్ కుమార్తె భార్య సావిత్రి కలరు. చిన్న కుమారుడు శంకర్. ఫిర్యాదు మేరకు తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# హమాలీల కూలీలు రేట్లు పెంచాలి

## - ఏఐసిటియూ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న

కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి, అక్టోబర్. 27, తరంగాలు : కేసముద్రం మండలం తహసిల్దార్ కి ఏ ఐ సి టి యు కార్మిక సంఘం అనుబంధం గ్రామీణ హమాలీల, కూలిల రేట్లు పెంచాలని కోరుతూ వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐసిటియు జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుండి హమాలీల రేట్లు పెరగకుండా ఉండడం మూలంగా వారి యొక్క జీవనోపాధి ఇబ్బందిగా మారిందని కాబట్టి కోఆపరేటివ్ బ్యాంకుల ద్వారా అదేవిధంగా ఐకెపి సెంటర్ల నుండి రాష్ట్ర ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేయిస్తుందని ఆయా సెంటర్లలో పనిచేసేటువంటి హమాలీలకు, కూలీలకు, కాంట, లోడింగ్, లారీలకు టార్పాల్ కప్పడం, తాడు కట్టడం, తదితర పనుల కింద బస్తా ఒకటికి 18- 50 పైసలు చొప్పున ఇస్తున్నారని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బస్తా ఒక్కంటికి 25 రూపాయల చొప్పున ఇవ్వాలని ఆ విధంగా రేట్లు పెంచాలని తహసిల్దార్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం జరుగుతుందని లేనియెడల ఉద్యమాలు చేపడతామని ఆయనతెలియజేశారు. ఈ కార్యక్రమంలో సకినాల నరేష్, బట్టు మురళి, కొమ్ము అనిల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# నిర్లక్ష్యానికి నిలువుటద్దం.. అధికారుల బాధ్యతారాహిత్యం..

- ప్రజావాణికి హాజరుకాని అధికారులు.
- ప్రజల సమస్యలపై పట్టింపేది...?
- అధికారుల తీరుపై పెదవి విరుస్తున్న మండల ప్రజలు.

పాలేరు ఆర్సీ, 27అక్టోబర్, (తరంగాలు) : పాలేరు నియోజకవర్గం లో తిరుమలాయపాలెం మండలంలోని ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమం అధికారుల నిర్లక్ష్యంగా మారినది. ప్రజా సమస్యలను వినిపించి వెంటనే పరిష్కారం చేసే వేదిక అధికారుల నిర్లక్ష్యంగా మారి ప్రజల్లో అసంతృప్తికి కారణమవుతుంది. తిరుమలాయపాలెం ఎంపీడీవో కార్యాలయంలో జరిగే ప్రజావాణి కి అధికారులు హాజరు కాకపోవడం తీవ్ర నిర్లక్ష్యంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. దరఖాస్తులను ఇవ్వటానికి వచ్చిన ప్రజలు అధికారులు లేకపోవడంతో మా సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాలి కుర్చీలను చూసి ప్రజలు నిరాశతో వెను తిరుగుతున్నారు. అధికారులు



నిర్లక్ష్యం చేస్తున్నందున ప్రజల సమస్యలు పరిష్కారం చేయటం అధికారులకు ఇష్టం లేదేమో అని ప్రజలు ప్రజావాణికి రావడం కూడా వెనుకడుగు వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అలసత్వం వీడి ప్రజావాణి కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

# పోలీసు అమరవీరుల త్యాగాలు స్మరించుకుంటూ భారీ బైక్ ర్యాలీ

- పోలీసు అమరులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలి.
- పోలీసు త్యాగాలకు గౌరవంగా ప్రతి ఒక్కరూ చట్టపరిధిలో నడుచుకోవాలి.
- సూర్యాపేట ఎస్పి నరసింహ

తరంగాలు / సూర్యాపేట, అక్టోబర్ 27 : పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల లో భాగంగా సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పి నరసింహ, అధనపు ఎస్పి రవీందర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి లతో కలిసి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద బైక్ ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల, కల్నల్ సంతోష్ బాబు చౌరస్తా, PSR సెంటర్, శంకర్ విలాస్ సెంటర్, MG రోడ్డు మీదుగా కొత్త బస్టాండ్ వరకు జరిగినది. కొత్త బస్టాండ్ వద్ద పౌరులతో జై జావాన్ , జై కిసాన్, జై పోలీస్ అంటూ, పోలీసు అమరవీరుల ఆశయాలను సాధిస్తాం అని పౌరులతో కలిసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పి నరసింహ మాట్లాడుతూ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. పోలీసు అమరవీరులు చేసిన త్యాగాలను ప్రజలకు తెలియజేయాలని సదుద్దేశంతో, పోలీసులు చేసే కఠినతరమైన విధులను ప్రజలకు తెలియజేయాలని ఉద్దేశంతో నిర్వహించడం జరుగుతుందని. ప్రతి పౌరుడు పోలీసు సమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలని, పోలీసు త్యాగాలకు గుర్తుగా ప్రతి ఒక్కరు సత్ప్రవర్తనతో



చట్టానికి లోబడి నడుచుకోవాలని సూచించారు, పోలీసు అమర వీరులను అనునిత్యం స్మరించు కుంటూ, నిరంతరం ప్రజలలో చిరస్మరణీయంగా ఉండటానికి నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుత సమాజంలో డ్రగ్స్ అత్యంత ప్రమాదకరంగా మారిందని వీటిని క్షేత్రస్థాయిలో నిర్మూలించడంలో పోలీసులు పౌరులు ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరారు. యువత దేశ భవిష్యత్తు అని యువత చెడు మార్గంలో వెళ్ళవద్దని గాంజాయ్ డ్రగ్స్ కు అలవాటు పడవద్దు అని ఈ సందర్భంగా ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, ఏ ఆర్ అధనపు ఎస్పి జనార్ధన్ రెడ్డి, సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్న కుమార్, ఏ ఆర్ డీఎస్పీ నరసింహ చారి, పోలీస్ సంఘం అధ్యక్షులు రామచందర్, సీఐ లు, ఆర్ ఐ నారాయణ రాజు, ఎస్ ఐ లు, ఆర్ ఎస్ ఐ లు కే అశోక్, ఎం అశోక్, సురేష్, సాయిరాం, రాజశేఖర్, యువత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# లక్కీ డ్రా ద్వారా పారదర్శకంగా మద్యం దుకాణాల ఎంపిక

- 93 మద్యం దుకాణాలకు 2771 టెండర్ల దాఖలు
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్

తరంగాలు / సూర్యాపేట, అక్టోబర్ 27 : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సూర్యాపేట జిల్లాలో లక్కీ డ్రా ద్వారా మద్యం దుకాణాలను పారదర్శకంగా ఎంపిక చేసినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం లక్కీ డ్రా ద్వారా మద్యం దుకాణాల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్కీ డ్రా అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మద్యం దుకాణాల టెండర్ లక్కీ డ్రా పారదర్శకంగా నిర్వహించామని స్పష్టం చేశారు. 2025- 27 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో మొత్తం 93 దుకాణాలు ఉన్నాయని, వాటిలో గౌడ్లకు 27 షాప్ లు,ఎస్సీ లకు 10 షాప్ లు , ఎస్ టి లకు చెందిన 3 షాప్ లు రిజర్వేషన్ ప్రకారం కేటాయించామని వెల్లడించారు. సెప్టెంబర్ 26 వ తేదీన టెండర్ నోటిఫికేషన్, అప్లికేషన్లు స్వీకరణ మొదలుపెట్టామని, దరఖాస్తులు అక్టోబర్ 23 వరకు స్వీకరించామని తెలిపారు. మొత్తం 2771 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. లక్కీ డ్రా లో మద్యం షాపులు పొందిన వారు డిసెంబర్




1వ తేదీ నుండి నూతన లైసెన్సులతో మద్యం దుకాణాలు నిర్వహించవచ్చని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం దుకాణాలు నిర్వహించాలని ఆదేశించారు. మద్యం షాపులు పొందిన వారు నిర్దేశించిన సమయంలో గా లైసెన్స్ ఫీజు చెల్లించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారి లక్ష్మానాయక్, ఎక్సైజ్ సి ఐ లు మల్లయ్య, శంకర్, నాగార్జున రెడ్డి, రజిత, స్టీఫెన్ సన్, ఎస్ ఐ లు, సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

# లక్కీ డ్రా ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు

- కలెక్టర్ సమక్షంలో కొనసాగిన టెండర్ ప్రక్రియ..
- బారీగా మోహరించిన పోలీసులు
- ప్రశాంత వాతావరణంలో కొనసాగిన లక్కీడ్రా
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్











తరంగాలు / మెదక్ , అక్టోబర్ 27 : మెదక్ జిల్లాలోని 49 మద్యం షాపులకు గాను మొత్తం 1420 దరఖాస్తులు వచ్చాయని, లక్కీ డ్రా ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఒక్కో షాపు వారీగా దాఖలైన దరఖాస్తులకు సంబంధించిన వారిని ఆహ్వానిస్తూ వారి సమక్షంలో కలెక్టర్ రాహుల్ రాజ్ లక్కీ డ్రా తీస్తూ మద్యం దుకాణాల కేటాయింపును ఖరారు చేశారు. లక్కీ డ్రా కోసం వినియోగించిన టోకెన్ లను అందరికీ చూపిస్తూ పారదర్శకంగా డ్రా నిర్వహించారు. ఎలాంటి అనుమానాల కు ఆస్కారం లేకుండా లక్కీ డ్రా ప్రక్రియ ప్రారంభం నుండి చివరి వరకు ఫొటో వీడియో చిత్రీకరణ జరిపించారు. పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారులు హాజరు కావడంతో టోకెన్ కలిగి ఉన్న వారినే లోనికి అనుమతించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శ్రీ వెంకటేశ్వర గార్డెన్ తో పాటు పరిసర ప్రాంతాల్లోనూ కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. లక్కీ డ్రాలో అదృష్టం వరించి వైన్ షాపులు కేటాయించబడిన వారు నిబంధనలను అనుసరిస్తూ లైసెన్స్ ఫీజు రూపేణా నిర్ణీత రుసుము చెల్లించేందుకు వీలుగా వేదిక వద్దనే అవసరమైన ఏర్పాట్లు కల్పించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి ఇతర అధికారుల పర్యవేక్షణలో మద్యం దుకాణాల కేటాయింపు లక్కీ డ్రా ప్రశాంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో మొత్తం 49 మద్యం షాపులు ఉన్నాయని, మెదక్ వెంకటేశ్వర గార్డెన్లో అత్యంత పారదర్శకంగా ఫోటోగ్రఫీ వీడియోగ్రఫీ ద్వారా లక్కీ డ్రా తీయడం జరిగిందన్నారు. ఇందులో రిజర్వేషన్ ప్రాతిపదికలో భాగంగా ఎస్టి -01, ఎస్సీ-06 గౌడ కులానికి సంబంధించి-09 మొత్తం 16 షాపులు కేటాయించామన్నారు, మిగతా 33 షాపులు అన్‌రిజర్వ్ కింద కేటాయించ డం జరిగిందన్నారు. ఇందులో 18 షాపులకు మహిళలు లాటరీ గెలుచుకోగా 31 షాపులకు పురుషులు దక్కించుకోవడం జరిగిందన్నారు. మద్యం టెండర్లు దక్కించుకున్న వారు డిసెంబర్ ఒకటో తేదీ నుంచి మద్యం షాపులు కేటాయించడం జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్, పోలీస సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాల టెండర్ లో ఇద్దరు స్వర్ణకారులను వరించిన లాటరి

తరంగాలు / మెదక్, అక్టోబర్ 27: మెదక్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన మద్యం టెండర్ ప్రక్రియలో మెదక్ పట్టణంకు చెందిన స్వర్ణకారుడు మైలవరం అర్చన నాగారాజు చారి కి పట్టణం లోని రెండో మద్యం దుకాణం, మామిడి ఆనంద్ చారికి మూడో నెంబర్ దుకాణం లు వరించాయి. తీవ్ర ఉత్కంఠ మధ్య రెండో దుకాణం కు 26 మంది, మూడో దుకాణం కు 23 మంది పోటిలో ఉన్న సందర్భం లో డ్రా సిస్టమ్ ద్వారా స్వర్ణకారలకు టెండర్ దక్కడం పట్ల పట్టణ స్వర్ణ కార సంఘం జిల్లా స్వర్ణ కార సంఘం అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు అభినందనలు తెలిపారు





## అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా భారీ బైక్ ర్యాలీ







తరంగాలు, మెదక్ జిల్లా అక్టోబర్ 27 : ఈ రోజు జిల్లా పోలీస్ కార్యాలయం నుండి రామదాసు చౌరస్తా వరకు భారీ బైక్ ర్యాలీ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ ఆదేశాల మేరకు మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో విధి నిర్వహణలో 14 మంది పోలీసులు ప్రాణాలు అర్పించారు. ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా సెంట్రల్ మరియు రాష్ట్ర పోలీస్ విభాగాల 191 మంది సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించారు. ఈ బైక్ ర్యాలీ ద్వారా అమరవీరులను స్మరించుకుంటూ వారి త్యాగం వెళకట్టలేనిదని గుర్తుచేసుకుంటు వారి సేవలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ ఏఆర్ డీఎస్పీ రంగా నాయక్ మెదక్ టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్ ఎస్బీ ఇన్స్పెక్టర్ ఎస్. సందీప్ రెడ్డి ఎస్ఐలు పోలీస్ సిబ్బంది మరియు స్థానిక యువత పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్ గవాయి పై దాడి చేసిన రాకేష్ కిషోర్ ని అరెస్ట్ చేయాలి

- నవంబర్ 1న హైదరాబాద్ లో జరిగే దళితుల ఆత్మగౌరవ నిరసన ప్రదర్శనను విజయవంతం చేయండి
- ఎమ్మార్పీఎస్ పాలకీడు మండల ఇంచార్జీ ఇంజమూరి మల్లయ్య



తరంగాలు / పాలకీడు, అక్టోబర్ 27 : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి భూషణ్ రామకృష్ణ గవాయి మీద జరిగిన దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం పాలకీడు మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మార్పిఎస్ పాలకీడు మండల ఇంచార్జీ ఇంజమూరి మల్లయ్య ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరిగి నేటికీ 20 రోజులు అవుతుందని, న్యాయ మూర్తిపై దాడికి పాల్పడిన దుండగులను ఇంత వరకు అరెస్టు చేయలేదని, ముఖ్యంగా దళితులు ఉన్నత స్థానంలో కూర్చోవడం కొంతమంది అగ్రకులాలకు గిట్టడం లేదని అందుకే ఈ దాడికి పాల్పడ్డారని ఇది చీఫ్ జస్టిస్ పై జరిగిన దాడి కాదని యా-వత్తు న్యాయ వ్యవస్థ దళిత సమాజంపై జరిగిన దాడిగా భావించుకుంటామని అన్నిటికన్నా భారత రాజ్యాంగ మీద దాడి జరుగుతుందని ఇలాంటి ఘటన పునరుత్వం కాకుండా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే ఢిల్లీ ప్రభుత్వం రాకేష్ కిషోర్ ని అరెస్టు చేయాలని, నవంబర్ 1న హైదరాబాద్ లో జరిగే దళితుల ఆత్మగౌరవ నిరసన ప్రదర్శనకు పాలకీడు మండలంలో అన్ని గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్య లో హైదరాబాద్ తరలివచ్చి విజయవంతం చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మంద నాగయ్య, బెట్టేగుడెం గ్రామ శాఖ అధ్యక్షుడు పిట్ట పవన్, నెమ్మది సుందరయ్య, రేవూరి విద్యాసాగర్, దేవరకొండ కరుణాకర్ లు పాల్గొన్నారు.

# నేర కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు



తరంగాలు / సంగారెడ్డి , అక్టోబర్ 27 : నేర కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జహీరాబాద్ టౌన్ ఎస్ హెచ్ ఓ కె వినయ్ కుమార్ హెచ్చరించారు. జహీరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న నేర కార్యక్రమాలను అసాంఘిక కార్యక్రమాలు నాకు పాల్పడే సుమారు 25 మంది రౌడీ షీటర్స్ ని పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దని, ఎలాంటి నేరాలు చేయోదని, సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సంగమేశ్వర్, పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆగు నర్సింలు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఒంటరి యువకునికి బాసటగా నిలిచిన ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్



తరంగాలు / యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 27: సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన కిష్టం నరసింహ, తల్లిదండ్రులు ఇద్దరు ఇటీవల అకాల మరణం చెందారు. ఈ నేపథ్యంలో ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ ఆ యువకునికి భరోసగా నిలిచి సోమవారం 50 కేజీ ల బియ్యాన్ని అందజేశారు. మునుముందు ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబ సభ్యులను పరిమర్శించిన మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి

### - బస్సు ప్రమాదంలో తల్లి కూతర్ల మృతి బాధాకరం



తరంగాలు / మెదక్, అక్టోబర్ 27 : మెదక్ మండలం శివ్వాయిపల్లి గ్రామానికి చెందిన మంగ సంధ్యారాణి (43), కూతురు మంగ చందన (23) కర్నూలు సమీపంలో జరిగిన బస్సు అగ్ని ప్రమాదంలో మృతి చెందారు. బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి సోమవారం శివ్వాయిపల్లి గ్రామానికి చేరుకొని సంధ్యారాణి, చందన మృత దేహాలకు పూలమాలలు వేసే నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులు ఆనంద గౌడ్, సిద్ధ గౌడ్ లను పరామర్శించి మనోధైర్యాన్ని తెలిపారు. బస్సు అగ్నిప్రమాదంలో తల్లి కూతురు సజీవ దాహనం కావడం చాలా బాధాకరమని అన్నారు. వీరి వెంట మెదక్ మండల పార్టీ అధ్యక్షులు అంజ గౌడ్, రైతు బందు మండల మాజీ అధ్యక్షులు కొత్తపల్లి కిష్టయ్య, మాజీ ఎంపిటిసి సిద్దయ్య, మాజీ సర్పంచ్ మాదవి, రవీందర్, పాపన్నపేట్ మాజీ సర్పంచ్ గురుమూర్తి గౌడ్, నాయకులు నరేందర్, విట్టల్ లు ఉన్నారు.

# జూబ్లీహిల్స్ లో మంత్రి వివేక్ తో కలిసి ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



తరంగాలు / కుత్బుల్లాపూర్, అక్టోబర్ 27: జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ని భారీ మెజారిటీతో గెలుపించేందుకు సోమవారం కార్మిక,గనుల శాఖ మంత్రి వివేక్ తో కలిసి కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ సోమవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని షేక్ పేట్ లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి ని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు అనునిత్యం తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయి అని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్ యాదవ్ పై అసత్యలను అంటకట్టి గెలువాలని చూడటం వారి భ్రమ మాత్రమే అన్నారు. చిన్న శ్రీశైలం యాదవ్ తో సహాయం కోరిన వారే ఈరోజు అసత్యాన్ని ప్రచురించడం చాలా బాధాకరం అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.నవీన్ యాదవ్ గెలుపు పై నియోజకవర్గం ప్రజలు గట్టి నమ్మకంతో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవుల రాజిరెడ్డి, రవీందర్ రెడ్డి, నర్సింహా రావు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన చల్లమల్ల కృష్ణారెడ్డి



తరంగాలు / యాదాద్రి భువనగిరి అక్టోబర్ 27 : సంస్థాన్ నారాయణపురం మండలం గుజ్జ గ్రామానికి చెందిన యువకుడు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్త చెన్నోజు రామాచారి ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుదాఘా తానికి గురై మృతి చెందాడు. ఈ వార్త తెలుసుకొన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చలమల్ల కృష్ణారెడ్డి అతని మరణం పట్ల విచారం వ్యక్తం చేస్తూ గుజ్జ గ్రామంలో వారి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 25 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరెంట్ షాక్ తో మృతి చెందిన యువకుడి కుటుంబానికి అండగా నిలిచిన భాస్కర్ ఫౌండేషన్



తరంగాలు / యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 27 : సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని గుజ్జ గ్రామానికి చెందిన చేన్నోజు రామాచారి (26) ఇంటి వద్ద ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తో మరణించాడు. ఈ నేపథ్యంలో ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ సభ్యులు ఆ కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం భరోసగా నిలిచి రూ. 5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆ కుటుంబానికి ఒక క్వింటల్ బియ్యం ఇస్తామని హామీ ఇచ్చి, ఒంటరిగా ఉన్న ఆ తల్లికి మునుముందు ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ సభ్యులు బండమీది కిరణ్, ఒర్సు విజయ్, ఎలిజాల శ్రీను, సిలువేరు సతీష్, పోలోజు వెంకటేష్, ఎర్ర పవన్, చాడ లింగస్వామి, చాడ రాములు, చాడ నరసింహ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# దేశం కోసం ప్రాణాలు అర్పించిన పోలీసుల త్యాగాలు ఎన్నటికీ మరువలేము - ఇబ్రహీంపట్నం ఏసీపి కే పి వి. రాజు




తరంగాలు / ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 27 : దేశం కోసం, దేశ ప్రజల కోసం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ ల త్యాగాలు ఎన్నటికీ మరువలేమని ఇబ్రహీంపట్నం ఏసీపి కే పి వి. రాజు అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఇబ్రహీంపట్నంలో వివిధ పాఠశాలలా, కళాశాలల విద్యార్థినీ విద్యార్థులతో కలిసి పోలీసులు సోమవారం ఇబ్రహీంపట్నం ప్రధాన కూడలి అంబేద్కర్ చౌరస్తా వరకు కవాతు నిర్వహించారు . ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఏసీపి కే పి వి. రాజు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న దేశవ్యాప్తంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని తర్వాత వారం రోజుల పాటు అమరవీరుల వారోత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు . దేశం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన పోలీసు సిబ్బంది ధైర్యసాహసాలను, అంకితభావాన్ని ఈ వారోత్సవాల ద్వారా గుర్తు చేసుకోవడం జరుగుతుందని, ప్రతి సంవత్సరం అక్టోబర్ 21ని పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా పాటించాలని నిర్ణయించారు. ఈ వారోత్సవాల్లో నిర్వహించే కార్యక్రమాలు వారోత్సవాల సందర్భంగా పోలీసు శాఖ వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తుంది: సంస్మరణ కవాతు: అక్టోబర్ 21న అమరవీరుల స్మారక చిహ్నాల వద్ద ప్రత్యేక పరేడ్ నిర్వహించి, అమరవీరులకు నివాళులర్పిస్తారు. రక్తదాన శిబిరాలు: ప్రజల భాగస్వామ్యంతో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తారు. సేవా కార్యక్రమాలు: పేదలకు నిత్యావసర వస్తువుల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు చేపడతారు. అవగాహన కార్యక్రమాలు: యువతలో పోలీసుల త్యాగాలపై అవగాహన పెంచడానికి సైకిల్ ర్యాలీలు, ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. పోలీసు అమరవీరుల కుటుంబాల సత్కారం: అమరవీరుల కుటుంబ సభ్యులను సత్కరించి, వారికి ధైర్యం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎస్ హెచ్ ఓ మహేందర్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్, ట్రాఫిక్ పోలీస్, పోలీసు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు పూర్తయ్యే వరకు పర్యవేక్షణ చేయాలి

- **దాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు పక్కాగా కార్యచరణ**
- **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



తరంగాలు / మెదక్, అక్టోబర్ 27 : ధాన్యం కొనుగోలు పూర్తయ్యే వరకు పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మెదక్ మండలం రాయన్ పల్లి గ్రామంలోని ఐ.కె.పి ధాన్యం కొనుగోలు సెంటర్ ను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ అన్నదాతలు ఎంతో శ్రమించి పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కేంద్రాలకు వచ్చే చివరి గింజను కొనుగోలు చేసేందుకు జిల్లా లో498 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కొనుగోలు కేంద్రాలను అధికారులు అప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తారని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దాన్యం కొనుగోలు పక్కాగా జరిగేలా చూడాలని ఆదేశించారు. గన్ని బ్యాగులు, తేమ కొలిచే యంత్రాలు, తూకం యంత్రాలు, రైతులకు కనీసం మౌలిక వసతులు, లోడింగ్, అన్ లోడింగ్ లో జాప్యం రాకుండా తగు రవాణా సదుపాయాలు మొదలగునవన్నీ ప్రతీ కొనుగోలు కేంద్రంలో అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలనీ అధికారులను ఆదేశించారు. వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేయాలని, వాటి వివరాలను రిజిస్టర్ లో, ట్యాబ్ లో నమోదు చేసి వీలైనంత త్వరగా రైతుల ఖాతాలో నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట అధికారులు, సిబ్బంది రైతులు ఉన్నారు.

# ఇబ్రహీంపట్నం అభివృద్ధి నా లక్ష్యం

## - ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



తరంగాలు / ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 27 : ఇబ్రహీంపట్నంను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని మునుగోడు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం చెరువు కట్ట సుందరీకరణ పనులపై పలు శాఖల అధికారులతో కలిసి సోమవారం ఆయన చెరువు కట్టను పరిశీలించారు. రాబోయే రోజుల్లో ఇబ్రహీంపట్నం చెర్వు కట్ట రూపురేఖలు మారుతాయని, రూ. 18 కోట్ల వ్యయం తో చెరువు కట్ట సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గం లో వందలాది కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరుగుతుందని, నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడం తన బాధ్యత అని, ఇబ్రహీంపట్నం చెరువు కట్ట పైన జరుగుతున్న ప్రమాధాలను నివారించే క్రమం లో ఉప్పరిగూడా కూడలిలో అండర్ పాస్ లేదంటే ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఇబ్రహీంపట్నం ప్రజాభవన్లో యాచారం మండలం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. మున్సిపల్ 10వ వార్డు ఖానాపూర్ లో డొంకని చంద్రన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు 32 మందికి 20 సిమెంట్ బ్యాగులను నిర్మాణదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ జెడ్పిటిసి మహిపాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శేఖర్ మామ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇరిగేషన్,ఎస్ఈ శ్రీనివాస్, ఆర్%డ%బీ, ఎస్ఈ రవిశంకర్, హెచ్ ఎం డిఏ ఈఈ రజిత, హెచ్ ఆర్డిసిఎల్ ఈఈ మహబూబ్ మియా, పి ఆర్ ఈఈ సుదర్శన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి, ఎమ్మార్వో అనిత, ఏసీపీ రాజు, ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్, సీఐ మహేందర్ రెడ్డి అధికారులు, నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ జాబితాపై సమీక్ష



తరంగాలు / తుర్కపల్లి, అక్టోబర్ 27 : తుర్కపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఓటర్ల జాబితా తయారీపై బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్ఓ)లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. తహసీల్దార్ దేశ్యా నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఓటరు జాబితా పకడ్బందీగా ఉండేలా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దేశ్యా నాయక్ మాట్లాడుతూ.. మండలంలో 2002లో ఉన్న ఓటర్ల జాబితాను నిశితంగా పరిశీలించి, ప్రస్తుతం 2025లో ఉన్న ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేయాలని బీఎల్ఓలను ఆదేశించారు. దీనివల్ల జాబితాలో లోపాలు లేకుండా, అర్హులందరికీ ఓటు హక్కు కల్పించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. జాబితా పరిశీలన, నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కల్పన, ఆర్ఐ జహంగీర్, కంప్యూటర్ ఆపరేటర్ దినేష్, అలాగే బీఎల్ఓలు పుట్ట సునీత, నారా భాగ్య, స్వప్న, శంకరమ్మ, లక్ష్మీ, శ్యామల, ఉమా, మాధురి, సంపత్ కుమారి, రాణి, రమాదేవి, మంజుల, యాదగిరి, బాలమణి, సంతోష, సులోచన లు పాల్గొన్నారు.

# ఒకే తెరపై రజనీ-కమల్..

## - దశాబ్దాల కల నెరవేరుస్తున్న దిగ్గజాలు



తమిళ సినీ పరిశ్రమలో దశాబ్దాలుగా అభిమానులు ఎదురుచూస్తున్న ఓ అద్భుత కలయిక సాకారం కాబోతోంది. సూపర్‌స్టార్ రజనీకాంత్, విశ్వనటుడు కమల్ హాసన్ కలిసి ఓ భారీ చిత్రంలో నటించనున్నారు. ఎప్పటినుంచో ఊహాగానాల్లో ఉన్న ఈ ప్రాజెక్ట్‌పై తాజాగా అధికారిక స్పష్టత వచ్చింది. రజనీకాంత్ కుమార్తె సౌందర్య, కమల్ హాసన్ కుమార్తె శ్రుతి హాసన్ ఈ వార్తను ధ్రువీకరించడంతో అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. చెన్నైలో జరిగిన ఓ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్న సౌందర్య, శ్రుతి ఈ ప్రాజెక్ట్‌పై స్పందించారు. కమల్ హాసన్‌కు చెందిన రాజ్ కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ పతాకంపై ఈ సినిమా నిర్మితం కానుందని, ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని వారు వెల్లడించారు. త్వరలోనే పూర్తి వివరాలతో అధికారిక ప్రకటన ఉంటుందని తెలిపారు. ఇటీవల సైమా అవార్డుల వేడుకలో కమల్ హాసన్ కూడా మాట్లాడుతూ, "మేమిద్దరం కలిసి నటించాలని చాలాకాలంగా అనుకుంటున్నాం. త్వరలోనే మీ ముందుకు వస్తాం" అని చెప్పడం ఈ వార్తకు మరింత బలాన్నిచ్చింది. గతంలో ఈ ప్రాజెక్ట్‌కు లోకేశ్ కనగరాజ్, ప్రదీప్ రంగనాథన్ వంటి దర్శకుల పేర్లు వినిపించినా, అవి కార్యరూపం దాల్చలేదు. తాజా సమాచారం ప్రకారం 'జైలర్' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న నెల్సన్ దిలీప్‌కుమార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశం ఉందని కోలీవుడ్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. ప్రస్తుతం రజనీకాంత్‌తో 'జైలర్ 2' పూర్తి చేసిన వెంటనే నెల్సన్ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను మొదలుపెట్టనున్నారని తెలుస్తోంది. రజనీకాంత్, కమల్ హాసన్ గతంలో 'అపూర్వ రాగంగళ్', 'మూండ్రు ముడిచ్చు', 'అంతులేని కథ' వంటి క్లాసిక్ చిత్రాల్లో కలిసి నటించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. అయితే, 1979లో వచ్చిన 'అల్లావుద్దీనుమ్ అద్భుత విళక్కుమ్' తర్వాత వారు మళ్లీ పూర్తిస్థాయిలో కలిసి నటించలేదు. దాదాపు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత ఈ ఇద్దరు దిగ్గజాలు ఒకే ఫ్రేమ్‌లో కనిపించనుండటంతో సినిమాపై అంచనాలు ఆకాశాన్నంటాయి.

# 'ధమాకా'ను మించి 'మాస్ జాతర' సాగేనా?

చాలా కాలం తరువాత రవితేజ - శ్రీలీల కలిసి థియేటర్స్ కి వస్తున్నారు. ఇద్దరి కాంబినేషన్లో రూపొందిన 'మాస్ జాతర' ఈ నెల 31వ తేదీన థియేటర్లకు రానుంది. 'ధమాకా' బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన తరువాత వాళ్లిద్దరి నుంచి వస్తున్న సినిమా ఇది. భాను భోగవరపు దర్శకత్వం వహించిన ఈ సినిమా కోసం మాస్ ఆడియన్స్ వెయిట్ చేస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ - సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా, రిలీజ్ కి ముందే మంచి బజ్ తెచ్చుకుంది. రవితేజకి మాస్ ఇమేజ్ పుష్కలంగా ఉందని ప్రత్యేకంగా చెప్పుకోవలసిన పనిలేదు. ఆయన స్టైల్ కి దగ్గరగా ఉండటం వల్లనే 'ధమాకా' ఆ రేంజ్ సక్సెస్ ను చూసిందని చెప్పచ్చు. తాను కూడా మాస్ కంటెంట్ ఉన్న సినిమాలలో సందడి చేయగలనని శ్రీలీల కూడా నిరూపించింది. అలాంటి ఈ ఇద్దరూ 'మాస్ జాతర' కోసం జోడీ కట్టారు. భీమ్స్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమా, థియేటర్ల దగ్గర సందడి



చేయడం ఖాయమనే టాక్ బలంగానే వినిపిస్తోంది. 'ధమాకా' వంటి హిట్ తరువాత రవితేజ ఐదు సినిమాల వరకూ చేశాడు. అయితే ఆ సినిమాలేవీ ఆ స్థాయిలో హిట్ కాలేదు. ఇక శ్రీలీల కూడా 'ధమాకా' తరువాత తన జోరును కొనసాగించింది. కానీ 'భగవంత్ కేసరి' తరువాత ఏ సినిమా కూడా ఆశించిన స్థాయిలో ఆడియన్స్ ను ఆకట్టుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో 'మాస్ జాతర' సక్సెస్ ఇద్దరి కెరియర్లోను కీలకంగా నిలిచింది. మరి ఈ సినిమా ఏ రేంజ్ వసూళ్లను రాబడుతుందనేది చూడాలి.

# ముఖానికి ట్రీట్‌మెంట్..!

## - ఎయిర్‌పోర్ట్‌లో మాస్క్ తీయని రష్మిక!

స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న గురించి సోషల్ మీడియాలో ఓ కొత్త చర్చ మొదలైంది. ఆమె తన ముఖానికి ఏదో ట్రీట్‌మెంట్ చేయించుకుందంటూ ఊహాగానాలు జోరందుకున్నాయి. ఇటీవల హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో మాస్క్ తీసేందుకు ఆమె నిరాకరించడమే ఇందుకు కారణమైంది. 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ కోసం హైదరాబాద్ వచ్చిన ఆమె, ఎయిర్‌పోర్ట్‌లో కనిపించారు. బ్లాక్ అవుట్‌ఫిట్, బ్లాక్ మాస్క్‌తో సింపుల్‌గా ఉన్న రష్మికను చూసి ఫొటోగ్రాఫర్లు 'మేడమ్, మాస్క్ తీయండి' అని కోరారు. దానికి ఆమె నవ్వుతూనే, 'ఫేస్ ట్రీట్‌మెంట్ అయ్యింది గయ్స్, తీయలేను' అని సున్నితంగా తిరస్కరించారు. ఈ ఒక్క మాటతో సోషల్ మీడియాలో రకరకాల చర్చలు మొదలయ్యాయి. రష్మిక తన అందాన్ని పెంచుకునేందుకు ఏదైనా కాస్మెటిక్ ట్రీట్‌మెంట్ చేయించుకుందా? ముఖ్యంగా పెదవులకు సంబంధించిన ట్రీట్‌మెంట్ ఏమైనా తీసుకుందా? అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఇటీవల విడుదలైన కొన్ని ఫొటోలు, వీడియోలలో ఆమె పెదాలు కాస్త ఉబ్బినట్లు కనిపించడమే ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది. రష్మిక సహజంగానే అందంగా ఉంటుందని, ఆమెకు ఇలాంటి ట్రీట్‌మెంట్లు అవసరం లేదని కొందరు అభిమానులు అభిప్రాయపడుతున్నారు. మరికొందరేమో, నటుడు విజయ్ దేవరకొండతో ఆమె ప్రేమలో ఉందనే వార్తల నేపథ్యంలో, పెళ్లికి ముందు కొత్త లుక్ కోసం సిద్ధమవుతోందేమో అని కామెంట్లు చేస్తున్నారు. అయితే ఈ ఊహాగానాలపై రష్మిక గానీ, ఆమె టీమ్ గానీ స్పందించలేదు. ప్రస్తుతం ఆమె కెరీర్ పరంగా చాలా బిజీగా ఉన్నారు. తెలుగు, హిందీ భాషల్లో పలు క్రేజీ ప్రాజెక్టులతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు.





# 'మా ఇంటి బంగారం'


## - కొత్త సినిమా మొదలుపెట్టిన సమంత



గత కొద్ది నెలలుగా ఉన్న ఊహాగానాలకు తెరదించుతూ స్టార్ హీరోయిన్ సమంత తన కొత్త చిత్రాన్ని అధికారికంగా ప్రారంభించారు. 'మా ఇంటి బంగారం' అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా సోమవారం పూజా కార్యక్రమాలతో లాంఛనంగా మొదలైంది. ఈ విషయాన్ని సమంత స్వయంగా తన సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. తన సొంత నిర్మాణ సంస్థ 'ట్రలాలా మూవింగ్ పిక్చర్స్' పతాకంపై ఆమె ఈ చిత్రాన్ని నిర్మిస్తుండటం విశేషం. ఈ ప్రారంభోత్సవానికి సంబంధించిన కొన్ని ఫొటోలను సమంత తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. ఈ వేడుకలో ఆమె నారింజ రంగు సల్వార్ కమీజ్‌లో ఎంతో ఉత్సాహంగా కనిపించారు. ఆమెతో పాటు తన పెంపుడు శునకం 'హాష్' కూడా ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీనికి సంబంధించిన ఫొటోను షేర్ చేస్తూ, "ఏం చూస్తున్నావ్? వాళ్లు షూటింగ్‌తో బిజీగా ఉన్నారు" అని సరదా క్యాప్షన్ జోడించారు. "ప్రేమ, ఆశీర్వాదాల మధ్య 'మా ఇంటి బంగారం' ప్రయాణం ముహూర్తంతో ప్రారంభమైంది. మేం ఏం సృష్టిస్తున్నామో మీతో పంచుకోవడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. ఈ ప్రత్యేకమైన సినిమాను ప్రారంభిస్తున్న మాకు మీ ప్రేమ, మద్దతు కావాలి" అని ఆమె తన పోస్ట్‌లో పేర్కొన్నారు. కాగా, ఈ నెలలోనే తన కొత్త సినిమా షూటింగ్ మొదలవుతుందని సమంత ఇటీవల అభిమానులకు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా, ఇటీవల ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్ 2025లో పాల్గొన్న సమంత తన వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొన్న సవాళ్లపై మాట్లాడారు. "నా విడాకులు, అనారోగ్యం.. ప్రతీది ప్రజల ముందు బహిర్గతమైంది. బలహీనంగా ఉన్నందుకు నిరంతరం విమర్శలు, ట్రోలింగ్ ఎదుర్కొన్నాను" అని ఆమె తన ఆవేదనను పంచుకున్నారు. అల్లు అర్జున్ నటించిన 'పుష్ప: ది రైజ్' చిత్రంలోని 'ఊ అంటావా' పాటలో నటించడంపైనా ఆమె స్పందించారు. "అటువంటి పాటలు నేను చేయగలనా లేదా అని పరీక్షించుకోవడానికే చేశాను. నన్ను నేను ఎప్పుడూ సెక్సీగా భావించలేదు. అది కేవలం ఒక సవాలుగా తీసుకుని చేసిన ప్రయత్నం మాత్రమే" అని సమంత వివరించారు.

# పెళ్లిపై శ్రీలీల ఆసక్తికర వ్యాఖ్యలు

శ్రీలీల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. టాలీవుడ్‌లోనే కాకుండా బాలీవుడ్‌లోనూ పెద్ద సినిమాల్లో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆశలన్నీ పవర్ స్టార్ పవన్ కల్యాణ్‌తో నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్', రవితేజతో చేస్తున్న 'మాస్ జాతర' చిత్రాలపై ఉన్నాయి. ఒకవైపు సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ శ్రీలీల అప్పుడప్పుడు పలు షోలలో పాల్గొనడంతో పాటు ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ఆమె పెళ్లి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు కాబోయే భర్తకు ఎలాంటి లక్షణాలు ఉండాలో శ్రీలీల వివరించారు. ప్రధానంగా తనకు కాబోయే వ్యక్తి అందంగా లేకపోయినా ఫర్వాలేదని, కానీ తనను ఎక్కువగా అర్థం చేసుకునే వ్యక్తి అయి ఉండాలని చెప్పారు. అంతేకాకుండా తన సినీ కెరీర్‌కు అతను మద్దతుగా ఉండటంతో పాటు తనను మంచిగా చూసుకోవాలని, తనతో సరదాగా ఉండాలని, అన్నింటికీ మించి నిజాయితీగా ఉండాలని తెలిపారు. ఇలాంటి లక్షణాలు ఉన్న వ్యక్తి కలిసినప్పుడు తప్పకుండా పెళ్లి చేసుకుంటానని శ్రీలీల స్పష్టం చేశారు. తన కాబోయే భర్తకు ఉండాల్సిన లక్షణాలపై నటి శ్రీలీల ఈ విధంగా చెప్పడంతో, ఇన్ని రకాల మంచి లక్షణాలు ఉన్న వ్యక్తి ప్రస్తుత సమాజంలో దొరకడం సాధ్యమేనా అన్న సందేహాలు నెటిజన్ల నుంచి వ్యక్తమవుతున్నాయి.



Printed,Published by,Owened by GADDAM NAGARAJU & Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad RNI. NO TELTEL/2022/83463 & Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com